

వివాహిత అదృశ్యం

జడ్చర్ల, ఆగస్టు 21: జడ్చర్ల పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటున్న వివాహిత నేనావత్ మధులత(19) కనిపించడంలేదంటూ ఆమె తల్లి దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఆదిరెడ్డి బుధవారం తెలిపారు. బషీరాబాద్ మండలం కొత్లాపూర్‌తండాకు చెందిన మధులతను అదే తండాకు చెందిన సభావత్ భీంజీతో వివాహం జరిపించారు. భార్యా భర్తలు జడ్చర్లలోని వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటున్నారు. పోలేపల్లి సెజ్‌లోని ఓ ఫార్మ పరిశ్రమలో భీంజీ పని చేస్తున్నాడు. భీంజీ ఈ నెల 20న రాత్రి తొమ్మిది గంటలకు విధులకు వెళ్లాడు. బుధవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి భార్య కనిపించకపోవడంతో మధులత తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. వెతికినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నాయకుల తీరుతో.. అభాసుపాలు





ఇటీవల గద్వాలలో ప్రాజెక్టుల సందర్శనకు వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఇంటికి వెళ్తుండగా కాన్వాయ్‌ను అడ్డుకున్న సరిత వర్గం నాయకులు, కార్యకర్తలు

- అధికార కాంగ్రెస్ పార్టీలో తరచూ ప్రొటోకాల్ గొడవలు
- గద్వాల, వనపర్తి నియోజకవర్గాల్లో వర్గాల కుమ్ములాటలు
- అలంపూర్‌లో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్‌ఎస్‌గా పంచాయితీలు
- తారాస్థాయికి విభేదాలు
- పంచాయతీ ఎన్నికల ముంగిట గొడవలతో నష్టమే
- అధిష్ఠానం పట్టించుకోకపోతే మరింత దిగజారే అవకాశం

మహబూబ్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరు.. పార్టీని అభాసుపాలు చేస్తోంది. పదేళ్ల తర్వాత అధికారంలో వచ్చిన పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన నాయకులు వర్గాలుగా విడిపోయి కుమ్ములాటలకు దిగుతుండటం బలాన్ని తగ్గిస్తోంది. అధిష్ఠానం సరిగా దృష్టి సారించకపోవడం, ముఖ్య నాయకుల దాటవేసే ధోరణి కారణంగా ప్రతిపక్షాలకు పని లేకుండానే.. స్వీయ తప్పులతో మరింత దిగజారిపోతోంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో 14 అసెంబ్లీ స్థానాలకుగాను 12 అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. 2018 ఎన్నికల్లో ఒక సీటు మాత్రమే గెలుచుకుని.. దాన్ని నిలబెట్టుకోలేక డీలాపడిన పార్టీకి ఈసారి ఏకంగా ప్రజలు మంచి మెజారిటీలు ఇచ్చి మరీ గెలిపించారు. గత ప్రభుత్వ విధానాల తీరుతోనో లేక నాయకుల వైఖరితోనో ఇబ్బంది పడిన జనం ఆ మేరకు తమ నిరసనను కాంగ్రెస్ పార్టీకి ఓటేయడం ద్వారా తీర్చుకున్నారు. ఇప్పుడు గెలిచిన వారిలో మెజారిటీ ఎమ్మెల్యేలు సొంత బలంతో కాకుండా వేవ్‌తో గెలిచినవారే ఎక్కువ. అయితే అదే ఒరవడిని కొనసాగించాల్సిన నాయకులు, పాలనను వదిలేసి.. కేవలం పార్టీలో విభేదాలతో కాలం వెల్లదీస్తున్నారు. కొందరు షాడో నాయకులు తయారై.. కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలను పక్కదారి కూడా పట్టిస్తున్నారు. ఎన్నికల్లో తమ వెంట నడిచారనే కారణంతో ఎమ్మెల్యేలు సదరు షాడోలను పక్కన పెట్టుకుంటే.. తామే వారిని ఎమ్మెల్యేలను చేశామని షాడో నాయకులు జబ్బలు చరుచుకుంటున్నారు. ఇదిలా ఉంటే ఒక పక్క షాడో నాయకుల వల్ల.. మరో పక్క సొంత పార్టీ ముఖ్య నాయకుల విభేదాలతో పార్టీ పరిస్థితి దిగజారుతోందని పలువురు సామాన్య కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరుగుతున్న ఘటనలు ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. అలాగే పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా ప్రొటోకాల్ విషయంలో కూడా పోటాపోటీగా నాయకులు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి. తమ నాయకుడు గొప్ప అంటే.. తమ నాయకుడే గొప్ప అంటూ వారి వారి అనుచరులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఇతర వర్గాలపై ఆరోపణలు చేస్తూ కాలం వెల్లదీస్తున్నారు. పదేళ్లుగా అధికారంలో లేకపోయినా.. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే విభేదాలు, నాయకుల మధ్య సమన్వయ లోపం పార్టీని దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తమవుతోంది.



వనపర్తి పట్టణంలో ఇటీవల ఆర్టీసీ బస్సు ప్రారంభం సందర్భంగా ప్రొటోకాల్ పాటించడం లేదంటూ వనపర్తిలో పోలీసులతో వాగ్వాదానికి దిగిన చిన్నారెడ్డి వర్గీయులు

గద్వాలలో గరంగరం..

గద్వాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సరిత వర్గాల మధ్య తీవ్ర స్థాయిలో విభేదాలు నెలకొన్నాయి. వీరిద్దరి మధ్య గతంలో బీఆర్‌ఎస్‌లో ఉన్నప్పటి నుంచే స్పర్థలు ఉన్నాయి. అవి ఇప్పుడు మరింత తీవ్రం అయ్యాయని చెప్పొచ్చు. బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. తర్వాత మళ్లీ బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని అన్నారు. అధిష్ఠానం కలుగజేసుకోవడంతో కాంగ్రెస్‌లోనే ఉన్నట్లు మంత్రి జూపల్లి ప్రకటించారు. ఇదిలా ఉంటే బండ్ల చేరిక సందర్భంగా సరిత వర్గం నాయకులు కొందరు సెల్‌ఫోన్ టవర్లు ఎక్కి, మరి కొందరు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా ప్రయత్నాలు చేశారు. అలాగే గాంధీభవన్‌కు వెళ్లి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. అయినప్పటికీ బండ్లను పార్టీలో చేర్చుకోవడంతో తమ ప్రాధాన్యంపై పలు మార్లు ముఖ్య నాయకులతో సమావేశం అయ్యారు. తాజాగా మంత్రి జూపల్లి కృష్ణారావు గద్వాలలోని ప్రాజెక్టుల పరిశీలనకు వచ్చారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఇంటికి వెళ్లి, ఆయన వెంట తీసుకుని పరిశీలనకు బయల్దేరారు. దీనిపై ఆగ్రహించిన సరిత వర్గం నాయకులు జూపల్లిని అడ్డుకోవడంతోపాటు కాన్వాయ్‌పై దాడి చేశారు. దీంతో జూపల్లి సరిత ఇంటికి వెళ్లి వారితో చర్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మెల్లమెల్లగా విభేదాలు కాస్త హింసాత్మక ఘటనలకు దారితీస్తున్నాయని చెప్పొచ్చు. ఈ విభేదాలు ఇలాగే కొనసాగితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మరింత ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. అలాగే అలంపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు కాంగ్రెస్ పార్టీలో చేరతారనే చర్చ జరిగినప్పటికీ.. ఇప్పటివరకు అధికారిక నిర్ణయం జరుగలేదు. రూమర్లను వారిద్దరూ ఖండించలేదు కూడా. అయితే ఇక్కడ కూడా పలుమార్లు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇటీవల తుమ్మిళ్ల లిఫ్టు ప్రారంభం సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు మోటార్లు ఆన్ చేసి వెళ్లారు. తర్వాత వాటిని ఆపేసి, తిరిగి సంపత్ వర్గం ప్రారంభించడం, విజయుడిని అరెస్టు చేయడం వంటి ఘటనలు జరిగాయి. ప్రొటోకాల్ పాటించడం లేదని బీఆర్‌ఎస్ నాయకులు వాగ్వాదం చేశారు. పార్టీలో చేరకముందే ఈ స్థాయిలో విభేదాలు ఉంటే.. పార్టీలో చేరితే ఆధిపత్యపోరు తారస్థాయికి చేరుతుందనే చర్చ జరుగుతోంది.

వనపర్తిలో ప్రొటోకాల్ రగడ..

వనపర్తి నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో తూడి మేఘారెడ్డి కాంగ్రెస్ నుంచి భారీ మెజారిటీతో గెలుపొందారు. మొదట చిన్నారెడ్డికి టికెట్ కేటాయించినప్పటికీ.. తర్వాత సమీకరణలు, గెలుపు పరిస్థితులను చూసుకుని మేఘారెడ్డిని అభ్యర్థిగా నిర్ణయించారు. ఆ రోజు నుంచి ఇక్కడ చిన్నారెడ్డి వర్సెస్ మేఘారెడ్డిగానే రాజకీయాలు నడిచాయి. చిన్నారెడ్డి వర్గం నాయకులు చాలామంది మనస్ఫూర్తిగా మేఘారెడ్డి గెలుపు కోసం పని చేయలేదని విమర్శలు ఉన్నాయి. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో చిన్నారెడ్డికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవి లభించింది. ఇక అక్కడి నుంచి ప్రొటోకాల్ రగడ ప్రారంభమైంది. మేఘారెడ్డి, చిన్నారెడ్డి వర్గాలుగా కాంగ్రెస్ పార్టీ వీడిపోయింది. చాలా సందర్భాల్లో ఇరువురు నాయకులు వేదికలను కూడా పంచుకోవడం లేదు. వనపర్తి పట్టణంలో ఆర్టీసీ బస్సు, ఖిల్లాఘనపురం మండలంలో పీహెచ్‌సీ, శ్రీరంగాపూర్, పెబ్బేరులో పలు అభివృద్ధి పనుల ప్రారంభం విషయాల్లో ప్రొటోకాల్ సమస్య తలెత్తింది. ఎమ్మెల్యే సొంత ఖర్చులతో చేపట్టిన కాలువల పనులను సైతం చిన్నారెడ్డి ప్రారంభించారనే విమర్శలు ఉన్నాయి. చివరకు పార్టీ కార్యక్రమాలు సైతం వేర్వేరుగా చేస్తున్న పరిస్థితి నెలకొంది. రాజీవ్‌గాంధీ జయంతిని మంగళవారం మూడు వర్గాలుగా విడిపోయి నిర్వహించారు. ఎవరికి వారే అన్నట్లు పరిస్థితి తయారైంది. సాధారణంగా ప్రజలతో ఎన్నుకోబడిన వారికి క్రియాశీలపాత్ర ఎక్కువగా ఉంటుంది. కానీ కేబినెట్ హోదా పదవితో ఈ అధికారాలకు ప్రభుత్వం బ్రేకులు వేసింది. వర్గాలు గ్రామ స్థాయికి చేరాయి. అయితే స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట ఇది తలనొప్పిగా మారే అవకాశం ఉంది. అధిష్ఠానం కలుగజేసుకోకపోతే ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంది.

పనులు పూర్తి చేయాలి

- పర్యాటక శాఖ అభివృద్ధి పనుల సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు
- పిల్లలమర్రిని సందర్శకులకు అందుబాటులోకి తెచ్చిన మంత్రి



పిల్లల మర్రి చెట్టును చూస్తున్న మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు, అధికారులు

మహబూబ్‌నగర్(కలెక్టరేట్), ఆగస్టు 21: మహబూబ్‌నగర్ జిల్లాలో చేపట్టిన పర్యాటక అభివృద్ధి పనులన్నీ నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జిల్లా సమీకృత అధికారుల కార్యాలయ భవన సముదాయంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా టూరిజానికి సంబంధించి పిల్లల మర్రి, మినీ ట్యాంక్‌బండ్, పాత కలెక్టరేట్ పరిధిలో నిర్మాణంలో ఉన్న త్రీ స్టార్ హోటల్, ఎకో పార్కులో చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. ఎకో పార్కులో చేపట్టే పనులపై త్వరలోనే రాష్ట్ర అటవీ శాఖ మంత్రితో మాట్లాడి సాధ్యసాధ్యాలను పరిశీలిస్తామని చెప్పారు. మహబూబ్‌నగర్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న మినీట్యాంక్ బండ్‌కు పర్యాటకులు ఎక్కువగా వచ్చేందుకు అవకాశం ఉన్నందున అక్కడి పనులను పూర్తిచేసే విషయంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఇంకా పెద్ద ఎత్తున అభివృద్ధి చేపట్టాలన్నారు. మినీ ట్యాంక్‌బండ్‌ను దగ్గరలో ఉన్న కాల్వ ద్వారా కృష్ణా నీటితో నింపేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పాత కలెక్టరేట్‌లో చేపట్టిన త్రీ స్టార్ హోటల్ పనులను కొనసాగించాలన్నారు. శిల్పారామంలోని షాపులను మహిళా సంఘాలు, చేతి వృత్తుల వారికి ఇచ్చేందుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పిల్లలమర్రిలో ల్యాండ్ స్కేప్‌తో పాటు, ఫౌంటేన్, చిల్డ్రన్స్ పార్క్ ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. వీటిన్నింటినీ నిర్దేశించిన సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మయూరి ఎకో పార్క్ వెనుక వైపు హరిత హోటల్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఎస్.మోహన్ రావు, పర్యాటక శాఖ ఎండీ ప్రకాష్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ వెంకటరమణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ్ తదితరులు హాజరయ్యారు.

పర్యాటక ప్రాంతాల సందర్శన

మహబూబ్‌నగర్: పాలమూరులోని పర్యాటక ప్రాంతాలను టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం సందర్శించారు. ఇటీవల అభివృద్ధి చేసిన పిల్లలమర్రిని ప్రారంభించి, సందర్శకులకు అందుబాటులోకి తెచ్చారు. అనంతరం మయూరి ఎకోపార్క్‌ను సందర్శించారు. ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి మధుసూదన్‌రెడ్డిలతో కలిసి సఫారి వాహనంలో జంగల్ సఫారి చేశారు. గోల్‌బంగ్లా ఎక్కి, ఎకో పార్క్‌ను వీక్షించారు. సందర్శకులకు ఆకర్షించేందుకు ఏమేం కార్యక్రమాలు చేయాలో అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో ఎన్నో పర్యాటక క్షేత్రాలున్నాయని, చాలామందికి వాటి గురించి తెలియకపోవడం వల్ల పర్యాటకులను ఆకర్షించలేకపోతున్నామని అన్నారు. పర్యాటక శాఖ మంత్రి అయ్యే వరకు తానే గోల్కొండ పోర్ట్‌ను చూడలేదని, అందుకే అన్ని పర్యాటక ప్రాంతాలను ప్రజలకు తెలియజేసేందుకు పాలమూరు నుంచే టూరిజం ప్రమోషన్ చేయాలని నిర్ణయించామని చెప్పారు. పిల్లల మర్రి క్షేత్రాన్నంతా కలియ తిరిగిన ఆయన పర్యాటకులను ఆకర్షించేందుకు ఇంకా అక్కడ ఏమేమి చేయాలో అధికారులు, ఎమ్మెల్యేలను అడిగి తెలుసుకున్నారు. పాలమూరు టూరిజం అభివృద్ధికి తక్షణం రూ.ఐదు కోట్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. పిల్లలమర్రి వద్ద రెస్టారెంట్, ల్యాండ్ స్కేప్, టాయ్‌లెట్స్ పర్యాటకులకు వసతులు కల్పిస్తామన్నారు. కోయిల్‌సాగర్, నల్లమల, సలేశ్వరం, మల్లెలతీర్థం, రామప్ప దేవాలయం, పాండవుల గుట్ట, హైదరాబాద్‌లోని గోల్కొండ, రహేజా కాంపెక్స్ వంటి అద్భుతమైన చారిత్రాత్మక ప్రాంతాల గురించి ప్రజలకు ప్రమోట్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. కృష్ణా పరివాహకంలో బోటింగ్ కోసం చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కొత్తబస్టాండ్ ఎదురుగా నిర్మాణంలో ఉన్న త్రీస్టార్ హోటల్, మినీ ట్యాంక్‌బండ్, కేబుల్ బ్రిడ్జి, హైలాండ్ పనులను పరిశీలించారు. అనంతరం అక్కడే ఉన్న మినీశిల్పారామంను సందర్శించారు. కలెక్టర్ విజయేందిరబోయి, ఎస్పీ జానకి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

కాన్పు కేసులన్నీ పాలమూరుకు



మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలోని మాతాశిశు విభాగం వద్ద కిక్కిరిసిన గర్భిణులు

- ఉమ్మడి జిల్లాల నుంచి జనరల్ ఆస్పత్రికి రెఫర్
- మే నుంచి జూలై వరకు వచ్చినవి 1,432 కేసులు
- అత్యధికంగా నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, జడ్చర్ల, వికారాబాద్ జిల్లాల నుంచే..
- మాతా, శిశు విభాగం డాక్టర్లు, సిబ్బందిపై పనిభారం
- ఈ నెలాఖరుకు పూర్తికానున్న సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల పని గడువు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం)ఆగస్టు 21: మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రెఫరల్ కేసుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. అన్ని జిల్లాలకు మెడికల్ కళాశాలలు మంజూరైనప్పటికీ చాలా వరకు కేసులను మహబూబ్‌నగర్‌కు పంపిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ఆయా జిల్లాల నుంచి 1,432 కేసులు రెఫర్ కావడం గమనార్హం. దీంతో జనరల్ ఆస్పత్రిలోని మాతా, శిశు విభాగంలోని డాక్టర్లు, సిబ్బందిపై పనిభారం పెరుగుతోంది. అంతే కాకుండా ఈ నెలాఖరు నాటికి సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల పని గడువు పూర్తి కావడంతో వాళ్లు కూడా వెళ్లిపోతే పరిస్థితి మరింత కష్టంగా మారే అవకాశం ఉంది.

జిల్లాల వారీగా మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి రెఫర్ అయిన కేసుల వివరాలు

జిల్లా	మే	జూన్	జూలై	మొత్తం
మహబూబ్‌నగర్	242	209	242	693
నారాయణపేట	90	104	163	357
నాగర్‌కర్నూల్	24	19	29	72
వనపర్తి	21	18	19	58
జడ్చర్ల (సీహెచ్‌సీ, మ.నగర్)	58	53	38	149
హైదరాబాద్	8	7	6	21
వికారాబాద్	14	9	12	35
రంగారెడ్డి	9	15	15	39
గద్వాల్	4	2	2	8
మొత్తం	470	436	526	1432

గైనిక్ కేసులే అధికం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సాధారణ కాన్పులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో సాధారణ, సిజేరియన్ కాన్పులు చేయాలని, అత్యవసరమైతేనే జిల్లా ఆస్పత్రులకు పంపించాలని రాష్ట్ర స్థాయి వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు గతంలోనే ఆదేశాలు జారీ చేశారు. కానీ చాలా చోట్ల వాటిని లెక్క చేయడం లేదు. సాధారణ కాన్పు అయ్యే కేసులను సైతం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి పంపిస్తున్నారు. ఆయా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు వచ్చిన కేసులకు అక్కడి సిబ్బంది ఏవో ఒక కుంటి సాకులు చెబుతున్నారు. ఏదైనా అయితే తమకేం సంబంధం లేదని భయాందోళనకు గురి చేస్తున్నారు. దీంతో చాలా వరకు సాధారణ కాన్పు కేసులు సైతం జనరల్ ఆస్పత్రికి పంపిస్తున్నారు. ఈ ఏడాది మే నుంచి జూలై వరకు ఉమ్మడి జిల్లాల నుంచి 1,432 కేసులు రెఫర్ కాగా, అందులో అత్యధికంగా నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, వికారాబాద్ జిల్లాల నుంచి ఉన్నాయి. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న జడ్చర్ల నుంచి సైతం కేసులు రెఫర్ అవుతున్నాయి.

పని భారంతో ఇక్కట్లు

మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి ఉమ్మడి జిల్లా నుంచి కాన్పు కేసుల రెఫరల్స్‌తో పాటు ఓపీ కేసుల సంఖ్య కూడా రోజు రోజుకు పెరుగుతోంది. ఓపీ రోజూ 400 నుంచి 600 ఉంటుండగా, కాన్పులు 30 నుంచి 50 వరకు చేస్తున్నారు. దాంతో డాక్టర్లు, సిబ్బందిపై పనిభారం పెరుగుతోంది. ప్రస్తుతం ఎంసీహెచ్ విభాగంలో ఒక హెచ్‌వోడీతో పాటు ఇద్దరు అసిస్టెంట్లు, ముగ్గురు అసోసియేట్ ప్రొఫెసర్లు ఉన్నారు. దీంతో పాటు సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు ఐదుగురు ఉన్నారు. మొత్తం 10 డాక్టర్లతో ఇంతపెద్ద విభాగాన్ని నడిపించడం కష్టతరంగా మారుతోంది. ఇదిలా ఉండగా ఐదు మంది సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల గడువు ఈ నెలాఖరుతో ముగుస్తుంది. వాళ్లు కూడా వెళ్లిపోనుండటంతో పరిస్థితి మరింత కష్టంగా మారే అవకాశం ఉంది. కొత్త డాక్టర్ల కోసం నోటిఫికేషన్ వేశారు. ఎవరైనా వస్తే కొంత మేలు జరిగే వీలుంది. మొత్తంగా ఎంసీహెచ్ విభాగాన్ని నడపడం కత్తిమీద సాములా మారింది.

అందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని ధర్నా

మక్తల్, ఆగస్టు 21: రాష్ట్రంలో రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని బుధవారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని ఎస్‌బీఐ బ్రాంచి ముందు అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భగవంతు, సీపీఐఎంఎల్ జిల్లా నాయకులు కిరణ్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ మాట్లాడారు. ఎన్నికల ముందు రైతులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత మాఫీని మూడు విడతలుగా చేపట్టిందన్నారు. మొదటి విడత జాబితాలో ఉన్న రైతులకు ఇప్పటికీ వారి ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలు పండించే సమయంలో బ్యాంకుల చుట్టూ తిరుగుతూ పంటలను నాశనం చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. పాస్‌పుస్తకం ఉన్న ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలన్నారు. రూ. 2 లక్షల రుణాలు మాఫీ చేసి మిగతా డబ్బులను తర్వాత కట్టించుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో తప్పుల పేరుతో బ్యాంకు ఖాతాలు ఆగాయనే నెపంతో నారాయణపేట జిల్లాలో 10 వేల ఖాతాల్లో రుణమాఫీ సొమ్ము జమకాలేదన్నారు. కార్యక్రమంలో రైతులు సంజీవ, బాలకృష్ణ, శివ, అంబ్రేష్, పోగుల మల్లప్ప, అశోక్, ఆశప్ప, ఎల్లమ్మ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

అత్త భూమి అమ్మొద్దని పెట్రోల్ పోసుకున్న అల్లుడు

- మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్‌లో ఘటన

మహమ్మదాబాద్, ఆగస్టు 21 : తనకు తెలియకుండా అత్త భూమిని అమ్ముకుంటుందని ఓ అల్లుడు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్‌లో జరిగింది. మండల పరిధిలోని వెంకట్‌రెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాగిరెడ్డి, అంజిలమ్మ దంపతులకు ఓ కుమార్తె రాఘవేంద్రమ్మ ఉన్నది. మగ పిల్లలు లేకపోవడంతో మహమ్మదాబాద్ గ్రామానికి చెందిన నర్సింహారెడ్డిని 15 ఏళ్ల కిందట ఇల్లరికం తెచ్చుకొని రాఘవేంద్రమ్మతో వివాహం జరిపించారు. వారంతా మహమ్మదాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఆరు నెలల కిందట అనారోగ్యంతో రాఘవేంద్రమ్మ మృతి చెందింది. దీంతో అత్త అంజిలమ్మ తన పేరున ఉన్న ఎకరం 30 గుంటల భూమిని అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి రూ. 84 లక్షలకు అమ్మింది. ఈ మేరకు బుధవారం రిజిస్ట్రేషన్ కోసం అంజిలమ్మ, కొనుగోలుదారులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న అల్లుడు నరసింహారెడ్డి అక్కడకు వచ్చి వారికి రిజిస్ట్రేషన్ చేయొద్దని, భూమి లేకుంటే తాను ఎలా బతకాలని బతిమిలాడాడు. కానీ, వారు తమ బిడ్డనే చనిపోయిందని, నీవు మాకేమవసరమని ప్రశ్నించారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఆగ్రహానికి లోనైన నర్సింహారెడ్డి బాటిల్‌లో తనవెంట తెచ్చుకున్న పెట్రోల్, అగ్గిపెట్టెతో తహసీల్దార్ చాంబర్‌లోకి చొరబడి తహసీల్దార్ ముందుకు వెళ్లి ఈ రిజిస్ట్రేషన్ చేయొద్దని గట్టిగా అరుస్తూ వంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. అగ్గి పెట్టెతో అంటించుకునే ప్రయత్నం చేశాడు. వెంటనే అక్కడ ఉన్న వారంతా అప్రమత్తమై అతన్ని కార్యాలయం బయటకు తీసుకెళ్లారు. తహసీల్దార్ తిరుపతయ్య సమాచారం మేరకు పోలీసులు అతన్ని స్టేషన్‌కు తరలించారు. భూమి రిజిస్ట్రేషన్‌ను నిలిపివేశారు.



ఆత్మహత్యాయత్నం చేసిన నరసింహారెడ్డితో మాట్లాడుతున్న పోలీసులు

పేకాట వ్యవహారంలో ముగ్గురు పోలీస్ అధికారులపై వేటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గద్వాల క్రైం, ఆగస్టు 21: జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన పేకాట వ్యవహారంలో పోలీసులపై పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయని 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో గత నెల 21న 'స్వాధీనంలో స్వాహా' అనే కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఈ విషయంపై రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు విచారణ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. అందులో భాగంగా బుధవారం ముగ్గురు పోలీస్ అధికారులపై వేటు వేస్తూ, మల్టీజోన్-11 ఐజీపీ వి.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఉండవల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కర్నూల్ జిల్లాకు చెందిన కొంత మంది పేకాట రాయుళ్లు పేకాట ఆడుతుండగా జిల్లా పోలీస్ బృందం దాడి చేసింది. ఆ సందర్భంగా వారి నుంచి దాదాపు రూ. 30 లక్షలు పట్టుకుంటే కేవలం రూ. రెండు లక్షల పైచిలుకు నగదును చూపించారని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, ఇతర అధికారులతో విచారణ చేయించిన తర్వాత ముగ్గురు పోలీస్ అధికారులపై చర్యలకు ఐజీపీ వి.సత్యనారాయణ చర్యలు తీసుకున్నారు. వారిలో జోగుళాంబ గద్వాల జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ జములప్ప, మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట ఎస్‌ఐ విక్రంకు పేకాట రాయుళ్లతో పరోక్ష సంబంధాలు ఉన్నట్లు, అలాగే ఉండవల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు తన స్టేషన్ పరిధిలో అంత పెద్ద ఎత్తున పేకాట ఆడుతున్నా జిల్లా పోలీస్ పార్టీ దాడి చేసే వరకు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించారని నిర్ధారణ కావడంతో ఆ ముగ్గురిని తక్షణమే విధుల నుంచి తొలగించి, వీఆర్‌లో పెట్టారు. వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ఇటీవలే టూరిజం శాఖామంత్రి జూపల్లి కృష్ణారావు గద్వాల, గట్టు ప్రాంతాల సందర్శన సమయంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణను పూర్తిగా నిలువరించనందున గద్వాల సీఐ భీంకుమార్‌ను మల్టీజోన్-11 వీఆర్‌కు అటాచ్ చేశారు.

ట్రావెల్స్ బస్సులో చోరీ

- 12 తులాల బంగారం, ఒక ల్యాప్‌టాప్ గయాబ్
- పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద గమనించిన బాధితులు
- బెంగళూర్ నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సులో ఘటన

అలంపూర్ చౌరస్తా, ఆగస్టు 21 : బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో చోరీ జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన అనూష, ప్రవీణ్ అనే ప్రయాణికులు జగన్ అనే ఓ ప్రైవేటు ట్రావెల్స్‌లో మంగళవారం రాత్రి బెంగళూరులో హైదరాబాద్ వెళ్లేందుకు బస్సు ఎక్కారు. అన్నమయ్య జిల్లా భాగ్యపల్లి శివారులో ఓ హోటల్ వద్ద భోజనం కోసం బస్సును ఆపారు. తర్వాత బుధవారం తెల్లవారుజామున పుల్లూరు టోల్‌ప్లాజాకు బస్సు చేరుకుంది. అనూష అనే మహిళ తన బ్యాగును తనిఖీ చేసుకోగా 12 తులాల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించింది. మరో ప్రయాణికుడు ప్రవీణ్ అనే వ్యక్తికి చెందిన తన ల్యాప్‌టాప్ చోరీకి గురైనట్లు గుర్తించి ఉండవల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. దీంతో సీఐ రవిబాబు ఉండవల్లి ఎస్సై శ్రీనివాస్‌నాయక్‌తో కలిసి బాధితుల నుంచి వివరాలను సేకరించారు. సదరు ట్రావెల్స్ బస్సులో ఈ ఘటన తెలంగాణ రాష్ట్రంలోకి రాకముందే జరిగింది కాబట్టి ఫిర్యాదును ఏపీ పోలీసులకు బదిలీ చేస్తున్నట్లు సీఐ రవిబాబు తెలిపారు.

డెంగీ పేరుతో డబ్బులు వసూల్

- రోగం వచ్చిందంటే చాలు రూ.50వేల దాకా డిమాండ్
- ప్రజల భయాలను సొమ్ము చేసుకుంటున్న ప్రైవేటు క్లినిక్‌లు


జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని డెంగీ ఎలీసా ఎనలైజర్ మిషన్

గద్వాల క్రైం, ఆగస్టు 21 : ప్రస్తుత కాలంలో డెంగీ కేసులు పెరుగుతుండటంతో దీనిని ఆసరాగా చేసుకొని ప్రజల భయాలను ప్రైవేటు క్లినిక్‌లు సొమ్ము చేసుకుంటున్నాయి. అయితే ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులు ఉండవని భావించిన ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లకు వెళ్లి వేలకు వేలు డబ్బులు పోగొట్టుకుంటున్నారు. అయితే ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న వసతులు కూడా ప్రైవేటులో లేకపోయినా కూడా ప్రజలు వీటిని గమనించకుండా ప్రైవేటు ఆసుపత్రులు, చివరకు ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తూ డబ్బులు పోగొట్టుకుంటున్న ఘటనలు గద్వాల జిల్లాలో చోటు చేసుకుంటున్నాయి.

ఎలీసా పరీక్షలు నిర్వహించని ప్రైవేటు ఆసుపత్రులు

జోగుళాంబ గద్వాల జిల్లాలో డెంగీ పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, ఆర్‌ఎంపీలు నిర్వహించే చికిత్సాలయాలు అన్ని కూడా ప్రజల నుంచి ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. వాస్తవంగా డెంగీ నిర్ధారణ చేయాలంటే ఎలీసా పరీక్షలు నిర్వహించాక పక్కాగా డెంగీ కేసు అని నిర్ధారణ చేయాలి. ఇలా కేవలం ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రమే ఇలా నిర్ధారిస్తునట్లు తెలుస్తుంది. ఇక ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, ఆర్‌ఎంపీలు నిర్వహించే వాటిలో అయితే ఎలీసా పరీక్షలు కాకుండా కేవలం కిట్ మెథడ్ చేస్తూ డెంగీ నిర్ధారణ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ విషయం జిల్లా వైద్యాధికారులకు తెలిసినా ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడంలేదు. అయితే ఇలా చేయడంతో డెంగీ నిర్ధారణ కాదని వైద్యాధికారులు చెబుతున్నారు. అలాగే ఈ కిట్ వారికి కేవలం రూ.150 నుంచి రూ.200 దాకా కొనుగోలు చేస్తారు. కాని వారు ప్రజల దగ్గర తీసుకోవడం మాత్రం రూ.1200 నుంచి రూ.1500 దాకా తీసుకుంటున్నట్లు బాధితులు వాపోతున్నారు. అంతేగాక ఇలా కిట్ మెథడ్‌తో డెంగీ నిర్ధారణ చేస్తూ ఒకవేళ డెంగీ నిర్ధారణ అయితే రోగి బంధువులను భయాందోళనకు గురిచేస్తూ రూ.50 వేల దాకా డబ్బులు లాగేసుకుంటున్నారు. ఒక్కసారి నిర్ధారణ అయితే మాత్రం రూ.50 వేలు ఇచ్చి రావాల్సిందేనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ పరిస్థితి విషమిస్తే వీరు ఇతర ప్రాంతాల డాక్టర్లతో కుమ్మక్కై కర్నూల్, హైదరాబాద్‌కు రెఫర్ చేస్తూ వారి నుంచి కమీషన్ కూడా తీసుకుంటున్నట్లు సమాచారం.

డెంగీ కేసులను ప్రభుత్వానికి లెక్కచూపని ప్రైవేట్ క్లినిక్‌లు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెంగీ కేసులు నమోదు అయితే ఏ ప్రాంతం, ఏ కాలనీ వాసికి డెంగీ సోకిందో ప్రభుత్వానికి లెక్కచూపాల్సి ఉంటుంది. ఇలా చూపడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్యసిబ్బంది డెంగీ సోకిన వ్యక్తి ఇంటి చుట్టు ఉన్న దాదాపు 50 ఇళ్ల పరిసరాల్లో నివారణ కోసం పైరిత్రిన్‌స్ప్రే చేస్తారు. అలాగే ఆ ఇళ్ల బయట నీరు నిలువ ఉన్నచోట, మురికికాలువల వద్ద ధిమోఫాస్ స్ప్రే చేస్తారు. కానీ ప్రైవేటు క్లినిక్‌లు, ఆసుపత్రుల్లో ఒకవేళ నిజంగా డెంగీ కేసులు నమోదు అయినా కూడా ప్రభుత్వానికి లెక్క చూపకపోవడంతో ఇళ్ల వైపు నివారణ మందును స్ప్రే చేయకపోవడంతో డెంగీ కేసులు మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో అధికారికంగా ఇప్పటివరకు కేవలం తొమ్మిది కేసులు మాత్రమే నమోదు కాగా ప్రైవేట్ క్లినిక్‌లలో అనధికారికంగా వందల సంఖ్యలో కేసులు నమోదు అయినట్లు తెలుస్తుంది.

నివారణకు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు

జోగుళాంబ గద్వాల జిల్లాలో డెంగీ కేసులను నిర్ధారించడానికి ప్రత్యేక ఎలీసా మిషన్ అందుబాటులో ఉండటంతో పాటు ప్రత్యేకంగా డెంగీ రోగుల కోసం ఒక వార్డును కూడా ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప తెలిపారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సదుపాయాలు ఉన్నట్లు ఆయన చెప్పారు.

మహబూబ్‌నగర్ రీజియన్‌లో అధిక ఓఆర్

» ఆర్టీసీ డిపోల అధికారులు, ఉద్యోగులకు ఆర్‌ఎం అభినందనలు



మహబూబ్‌నగర్ డిపోలో మహిళా ఉద్యోగులకు స్వీట్లు తినిపిస్తున్న ఆర్‌ఎం శ్రీదేవి

మహబూబ్‌నగర్ టౌన్, ఆగస్టు 21 : రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్ రీజియన్‌లో ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) సాధించినందుకు అన్ని డిపోలలోని అధికారులు, ఉద్యోగులకు ఆర్‌ఎం వి. శ్రీదేవి అభినందనలు తెలిపారు. ఈనెల 19, 20వ తేదీలలో మహబూబ్‌నగర్ రీజియన్‌లోని అన్ని డిపోలలో గల ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, అధికారులందరూ సమన్వయంతో పని చేసి అధిక ఓఆర్ 131, 132 సాధించినందుకు ప్రతీ ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం మహబూబ్‌నగర్ డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్.ఎం. మాట్లాడుతూ అన్ని డిపోలలో మహిళా ఉద్యోగులు రాఖీ పండుగ రోజు డ్యూటీలకు వంద శాతం హాజరవడం అభినందనీయనమని అన్నారు. అనంతరం మహిళా ఉద్యోగులకు స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగంనన్ డిపో మేనేజర్ సుజాతతో పాటు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోజు రోజుకు పెరుగుతున్న ఉల్లి ధర

» క్వింటాలుకు గరిష్ఠంగా రూ.4,030



దేవరకద్ర మార్కెట్‌కు వచ్చిన ఉల్లి

దేవరకద్ర, ఆగస్టు 21 : ఉల్లిగడ్డ ధర గత వారంతో పోల్చితే ఈవారం పెరిగింది. ప్రస్తుతం ఉల్లి సీజన్ తగ్గినందున ధరలు పెరుగుతున్నాయి. నాలుగు వారాల కిందట కొంత వరకు తగ్గిన ఉల్లి ధరలు బధవారం జరిగిన వేలంలో మరింత పెరిగాయి. దాదాపు 60 బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది. మార్కెట్‌లో జరిగినఉల్లి బహిరంగ వేలంలో గరిష్ఠంగా క్వింటాల్‌కు రూ.4030, కనిష్ఠంగా రూ.3760 ధర పలికింది. నెల రోజుల నుంచి కొంత పెరుగుతోంది. 22 క్వింటాళ్ల ఉల్లిగడ్డ అమ్మకానికి వచ్చినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు. గత వారం కంటే ఈ వారం 120 ధర పెరిగింది. దీంతో మార్కెట్‌లో చిరు వ్యాపారులు 50 నుంచి 80 వరకు విక్రయిస్తున్నారు.

ఎన్‌సీడీ కేసులను క్రమం తప్పకుండా నిర్వహించాలి

» సీవీహెచ్‌వో డాక్టర్ అబ్దుల్ వాసే



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర సీవీహెచ్‌వో డాక్టర్ అబ్దుల్‌వాసే

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 21 : జిల్లాలో ఎన్‌సీడీ(అసంక్రమిత) ఫాలోఫ్ కేసులను క్రమం తప్పకుండా నిర్వహించాలని రాష్ట్ర సీవీహెచ్‌వో(కార్డియో వెస్కులార్ హెల్త్ అధికారి) డాక్టర్ అబ్దుల్‌వాసే వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతీనెల గ్రామాల్లో ఉన్నటువంటి బీపీ, షుగర్ పేషెంట్లకు, మందులు పంపిణీ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే ఈ కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో క్యాంపులను ఏర్పాటు చేసి 30 సంవత్సరాలు పైబడిన వారందరికి స్క్రీనింగ్ జరపాలని, వాటిని మెడికల్ అధికారి లాగిన్‌కు పంపించి స్కానింగ్ జరపాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యాంసుందర్, డీడీఎం రామాంజనేయులు, కల్యాణి, వివిధ ప్రాథమిక మెడికల్ అధికారులు, సూపర్‌వైజర్లు ఉన్నారు.

పిడుగు పాటుకు మూడు ఆవులు మృతి

» రూ. 2 లక్షల 50 వేలు నష్టం



పిడుగు పాటుకు మృతి చెందిన జెర్సీ ఆవుల వద్ద రైతుతో మాట్లాడుతున్న తహసీల్దార్

ఉప్పునుంతల, ఆగస్టు 21: నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని తాడూరు గ్రామంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి పిడుగు పడి బూరం విష్ణుకు చెందిన మూడు జర్సీ ఆవులు మృతి చెందాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తన వ్యవసాయ పొలంలో కట్టేసిన జర్సీ ఆవులపై రాత్రి పిడుగు పడి మృతి చెందినట్లు వారు తెలిపారు. బుధవారం ఉదయం వ్యవసాయ పొలానికి వెళ్లగా మూడు ఆవులు మృతి చెంది ఉన్నాయని బాధితుడు విలపించారు. బాధితుడి సమాచారం మేరకు తహసీల్దార్ సునిత ఆదేశాల మేరకు ఆర్ఐ సుజాత సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకొని పంచనామా నిర్వహించారు. ప్రాథమికంగా రూ. 2 లక్షల 50 వేల నష్టం జరిగినట్లు వారు తెలిపారు.

బెల్లం రవాణా చేస్తున్న లారీ సీజ్



స్వాధీనం చేసుకున్న బెల్లంతో ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి

కొల్లాపూర్, ఆగస్టు 21: ట్రాన్స్‌పోర్టు లారీలో బెల్లం రవాణా చేస్తున్నారని ఎక్సైజ్ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు బుధవారం బంగారయ్య ట్రాన్స్‌ఫోర్టులో లారీలో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం రవాణా అవుతుందన్న సమాచారం మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ బస్టాండ్ దగ్గర వేచి ఉన్న డీసీఎం వెహికల్‌ను తనిఖీ చేయగా (616) కేజీల బెల్లం పట్టుబడింది. బెల్లం స్వాధీనం చేసుకుని బెల్లం రవాణా చేసిన వ్యక్తిపై, ట్రాన్స్‌పోర్టు వారిపై (ఇద్దరు)పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. డీసీఎం అశోక్ లైలాండ్ వాహనంను సీజ్ చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి వెల్లడించారు. ఈ తనిఖీలలో డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజ్యలక్ష్మి, ఎస్ఐలు హనుమంత్, అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలలో పర్యవేక్షణ కరువు

» ఏడాదిన్నరగా పర్యవేక్షణ అధికారి పోస్టు ఖాళీ
» ఎస్‌వోలు, ఉపాధ్యాయులది ఇష్టారాజ్యం
» విద్యార్థులకు అందని నాణ్యమైన భోజనం
» పలు చోట్ల అనారోగ్యానికి గురవుతున్న పిల్లలు



మహబూబ్‌నగర్ అర్బన్ కేజీబీవీ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 21 : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పర్యవేక్షణ చేసే అధికారులు లేక ఆ విద్యాసంస్థల్లో పనిచేసే ప్రత్యేక అధికారుల, ఉపాధ్యాయులది ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. ఇటీవల పలు కేజీబీవీలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందక విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనలు చేసిన ఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం ఖాళీగా ఉన్న కేజీబీవీ పర్యవేక్షణ అధికారి పోస్టును భర్తీ చేసేందుకు ముందుకు రావడం లేదు. కేజీబీవీలను పర్యవేక్షించే అధికారి తప్పనిసరిగా మహిళ అయి ఉండాలి. లేకుంటే పురుషులు ఉంటే 50 ఏళ్ల పై బడిన వారై ఉండాలి. కానీ మహబూబ్‌నగర్ జిల్లాలో గత (బాలికల విద్య, సమానత్వం అధికారి) 2023 జనవరిలో ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. కొత్త మహిళా అధికారి వచ్చే వరకు విధుల్లో కొనసాగాలని ఆదేశాలు ఇచ్చారు. సదరు అధికారికి యాక్సిడెంట్ కావడంతో విధుల నుంచి తప్పుకున్నారు. అప్పటి నుంచి అంటే సెప్టెంబరు 2023 సీఎంవోగా పని చేస్తున్న అధికారికి జిల్లా విద్యాశాఖ అధికారి అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. ఆ అధికారి ఉన్నతాధికారుల ఆదేశాలు కాదనలేక బాధ్యతలు తీసుకున్నారు. అప్పటి నుంచి కేజీబీవీ పర్యవేక్షణ బాధ్యతలు ఒత్తిడి మధ్యలో చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ సెక్టోరియల్ పోస్టుల కోసం సమగ్ర శిక్షా ద్వారా పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో మెరిట్ సాధించిన వారికి సెక్టోరియల్ బాధ్యతలు అప్పజెప్పుతారు. జిల్లాలో సెక్టోరియల్ అధికారి పోస్టు కోసం (బాలికల విద్య, సమానత్వం అధికారి) ఓ మహిళా ఉపాధ్యాయురాలికి జిల్లా స్థాయి మొదటి ర్యాంక్ సాధించి ఉన్న ఆమె పోస్టింగ్‌కు రాకుండా కొందరు అధికారులే అడ్డుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పోస్టు కోసం అర్హత ఉండి విశ్వప్రయత్నాలు చేసినా ఆమెను మాత్రం ఈ పోస్టులోకి రానివ్వకూడదని కంకణం కట్టుకొని పని చేస్తున్నట్లు తెలుస్తోంది. తనకు పోస్టు ఇవ్వాలని, తను అర్హురాలినని పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఉన్నతాధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మొత్తంగా మహిళా అధికారి పర్యవేక్షణలో ఉండాల్సిన కేజీబీవీలు అధికారుల పంతాల కారణంగా పర్యవేక్షణకు నోచుకోవడం లేదు. దీంతో కేజీబీవీలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందక, విద్యార్థులకు సరైన వసతుల్లేక జిల్లాలోని పలు కేజీబీవీలలో విద్యార్థులు ఇబ్బంది పడుతున్న ఘటనలు చూస్తున్నాం. ఇంత జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. కనీసం అర్హత సాధించిన ఉపాధ్యాయురాలికి పోస్టింగ్ ఇవ్వకున్నా నిబంధనల ప్రకారం డీఈవో కార్యాలయంలో ఉండే మహిళా అధికారిణి కేజీబీవీల పర్యవేక్షణ అధికారిగా నియమించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రవీందర్‌ను వివరణ కోరగా నియామకానికి సంబంధించి ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.

పాముకాటుకు బాలుడి మృతి

ఇటిక్యాల, ఆగస్టు 21 : పాము కాటుకు బాలుడు మృతి చెందిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం గోపలదిన్నె గ్రామంలో చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో బోయ బజారి కుటుంబం మంగళవారం రాత్రి భోజనం చేసి గుడిసెలో నిద్రించారు. మధ్యరాత్రి బజారి కుమారుడు వేణుగోపాల్(9) నిద్రలో నుంచి లేచి ఊపిరి ఆడడం లేదని, ఇబ్బందిగా ఉందంటూ తండ్రిని నిద్ర లేపి చెప్పాడు. దీంతో ఆయన కుమారుడికి నీరు తాగించి పడుకున్న ప్రదేశాన్ని పరిశీలించగా పాము కన్పించింది. పాముకాటు వేసి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేసిన ఆయన వెంటనే ఆటోలో గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో బాలుడిని కర్నూల్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ వేణుగోపాల్ బుధవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి బజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నందిగామ, ఆగస్టు 21 : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. రంగారెడ్డి జిల్లా నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలోని బైపాస్ రోడ్డులో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలం, లింబ్యా తండాకు చెందిన నేనావత్ చందు(47) తన ద్విచక్రవాహనంపై భార్య జ్యోతితో కలిసి నందిగామ వైపు నుంచి రాంగ్‌రూట్లో షాద్‌నగర్ వెళ్తున్నాడు. ఎమ్ఎస్ఎన్ పరిశ్రమ సమీపంలో షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో నేనావత్ చందు రోడ్డుపై పడడంతో షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ చందుపై నుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో చందు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్యతో పాటు మరో ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకునికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు, మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గోపాలకృష్ణ తెలిపారు.

రాష్ట్ర స్థాయిలో గెలుపొందాలి

» జిల్లా బాస్కెట్ బాల్ సంఘం అధ్యక్షుడు మక్సూద్‌బిన్ అహ్మద్‌జాకీర్
» ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక



పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 21 : రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలువాలని జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు మక్సూద్‌బిన్ అహ్మద్ జాకీర్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 25, 26వ తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్-16 బాల, బాలికల బాస్కెట్‌బాల్ టోర్నీ పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికలను బుధవారం జిల్లా స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మక్సూద్‌బిన్ అహ్మద్‌జాకీర్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదని, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారన్నారు. బాస్కెట్‌బాల్ క్రీడాకారులు క్రీడా కోటా ఉద్యోగాలు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. టోర్నీలో జిల్లా జట్టు క్రీడాకారులు ప్రతిభ చాటి జాతీయ స్థాయి టోర్నీకి ఎంపికావాలని ఆకాంక్షించారు. ఎంపికైన క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించి తుది జట్టును ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నసురుల్లా హైదర్ మహ్మద్, ఉపాధ్యక్షుడు సుబహాన్‌జీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ మీర్‌ఖలీద్‌అలీ, జాయింట్ సెక్రటరీలు మహ్మద్ ఇలియాజ్, కోచ్ ఖలీల్ పాల్గొన్నారు.

150 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి



దిగువ జూరాల కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి అనంతరం దిగువకు వెళ్తున్న నీరు

ఆత్మకూరు, ఆగస్టు 21: ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో 150 మిలియన్ యూనిట్లకు విద్యుత్ ఉత్పత్తి చేరుకుందని జెన్‌కో ఎస్‌ఈ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టుకు వరద వస్తుండడంతో ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ప్రారంభించామని ఎస్‌ఈ తెలిపారు. గడిచిన 24 గంటలలో ఎగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 4.035 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి కాగా ఇప్పటి వరకు 90.160 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి అయిందన్నారు. అలాగే దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో గడిచిన 24 గంటల్లో 4.789 మిలియన్ యూనిట్లో ఉత్పత్తి కాగా ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 66.229 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి అయిందని తెలిపారు. వరద ఇలాగే కొనసాగితే రికార్డు స్థాయిలో ఉత్పత్తి జరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు.



సుంకేసుల డ్యాం నుంచి పరవళ్లు తొక్కుతున్న వరద నీరు

సుంకేసుల డ్యాంకు పెరిగిన వరద

» 95,100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. దిగువకు 92,600 క్యూసెక్కులు విడుదల

రాజోలి, ఆగస్టు 21 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి శివారులో ఉన్న సుంకేసుల జలాశయానికి వరద నీటి ఉధృతి పెరిగిందని సుంకేసుల జలాశయం జేఈ రాజు తెలిపారు. బుధవారం సుంకేసుల జలాశయానికి 95,100 క్యూసెక్కులు వరద నీరు వస్తుండటంతో జలాశయం నుంచి 21 గేట్ల ద్వారా 92,600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. డ్యాం నీటి సామర్థ్యం 292.00 కాగా, ప్రస్తుతం 291.80 మీటర్లుగా నమోదైంది. గరిష్ఠ నీటి నిల్వ 1.20 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.152 టీఎంసీల నీరు ఉందని, కర్నూలు కేసీ కెనాల్‌కు 2,400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎగువన కురిసిన వర్షాల కారణంగా డ్యాంకు వరద పెరిగిందని జేఈ తెలిపారు.

వర్గీకరణపై సుప్రీంకోర్టు పునరాలోచించాలి

» తీర్పును వ్యతిరేకిస్తూ మాలమహానాడు నాయకుల నిరసన



అలంపూర్‌లో రోడ్డుపై బైఠాయించి బంద్‌కు మద్దతు తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

అలంపూర్/మల్దకల్/ఇటిక్యాల, ఆగస్టు 21 : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టులో ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ బుధవారం అలంపూర్ బంద్‌కు మాలమహానాడు నాయకులు స్వచ్ఛందంగా పిలుపునిచ్చారు. అలంపూర్ పట్టణంలోని వ్యాపార, వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు బంద్ పాటిస్తూ స్వచ్ఛందంగా మద్దతు పలికారు. ఎస్సీ వర్గీకరణ ముసుగులో దళితులను విడదీసే కుట్ర జరుగుతోందని, ఈ కుట్రలో ఏ రాజకీయ పార్టీలు పాలుపంచుకోకూడదని సూచించారు. ప్రభుత్వాలు దళితుల అభివృద్ధి, ఐక్యతకు పని చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు తుమ్మల రవి, రజినీబాబు, పరుశరాముడు, ఎర్రన్న, బుచ్చన్న, వేణు, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. మల్దకల్‌లో బీఎస్పీ నాయకులు బంద్‌లో భాగంగా నిరసన తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వర్గీకరణకు అనుకూలంగా ఉంటూ భవిష్యత్ తరాల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు లేకుండా చేసే కుట్ర పన్నుతోందని బీఎస్పీ మండల అధ్యక్షుడు నరేష్ అన్నారు. ఇటిక్యాలలో బీఎస్పీ నాయకులు బంద్‌లో భాగంగా నిరసన తెలిపారు. పార్లమెంటులో మెజార్టీ కలిగిన బీజేపీ వర్గీకరణ ఎందుకు చేయడం లేదని నాయకులు మండిపడ్డారు.

ఇష్టపడి చదివితే అనుకున్నది సాధ్యం

» సివిల్ సర్వీసు ర్యాంకర్ దోనూరు అనన్యరెడ్డి



అనన్యరెడ్డికి చెక్కును అందజేస్తున్న చైర్మన్ రవికుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 21 : విద్యార్థులు చిన్నప్పటి నుంచి లక్ష్యం కోసం ఇష్టపడి చదవాలని, అప్పుడే అనుకున్నది సాధించడం కష్టమేమికాదని ఐఏఎస్ ర్యాంకర్ దోనూరు అనన్యరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రం సమీపంలోని జేపీఎన్‌సీఈలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల ఆలోచనా విధానాన్ని సానుకూలంగా ఉంచుకోవడం వల్ల తమ లక్ష్యం వైపు నడుస్తారన్నారు. ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోగలుగుతామన్నారు. నిరంతర సాధన, కృషితో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.చిన్నప్పటి నుంచి ఇష్టపడి చదివితే సివిల్స్ సాధించడం కష్టంకాదన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నస్థాయికి ఎదగాలన్నారు. ఈ సందర్భంగా జేపీఎన్‌సీఈ చైర్మన్ కేఎస్ రవి కుమార్ తదితరులు అనన్యరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి స్మారక స్ఫూర్తి అవార్డు కింద రూ.25000 చెక్కును కళాశాల చైర్మన్ రవికుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వి.వెంకట రామారావు, ప్రిన్సిపాల్ సుజీవన్ కుమార్, అకాడమిక్ డైరెక్టర్ కృష్ణమూర్తి, అనన్య రెడ్డి తండ్రి సురేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు కృష్ణవర్ధన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలు ఆరోగ్యశ్రీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

» మహబూబ్‌నగర్ మునిసిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్



మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), ఆగస్టు 21 : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం సేవలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్‌నగర్ మునిసిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని సుశ్రుత ప్రజావైద్యశాలలో గుండె వైద్యసేవలకు సంబంధించి ఉచిత ఆరోగ్యశ్రీ సేవల విభాగాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మనిషి ఒత్తిడులకు లోనై గుండెపోటు బారిన పడుతున్నాడని, పెద్ద, చిన్న వయసు తేడా లేకుండా చాలా మంది గుండెపోటుతో చనిపోతున్నారన్నారు. గుండె వైద్యసేవలకు లక్షల్లో ఖర్చు అవుతుందని, పేద ప్రజలు అంత డబ్బులు వెచ్చించే స్తోమత లేని వారి కోసం ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం ద్వారా ఉచితంగా గుండె వైద్య సేవలు పొందవచ్చని, అది కూడా సుశ్రుత ఆసుపత్రిలో అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి వర్తిస్తుందన్నారు. ప్రభుత్వం కూడా ఆరోగ్యశ్రీ పథకంలో మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఖర్చు పరిమితిని రూ. 10 లక్షల వరకు పెంచిందని గుర్తు చేశారు. ప్రజలకు ఈ పథకంలో నాణ్యమైన సేవలు అందించాలని, లాభాపేక్షలేకుండా సేవాభావంతో కూడా పనిచేయాలని సూచించారు. అదేవిధంగా ఆసుపత్రి ఎండీ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామని, ముఖ్యంగా అప్పుడే పుట్టిన శిశువుల వైద్యసేవలకు సంబంధించి నియోనెటల్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసి ఆరోగ్యశ్రీ ద్వారానే అన్ని సేవలు ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రమాదేవి, నిమ్స్ ఆసుపత్రి కార్డియోథోరాసిక్ సర్జన్ హెచ్‌వోడీ డాక్టర్ అమరేష్‌రావు, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామ్మోహన్, ఆసుపత్రి ఎండీ డాక్టర్ ప్రతిభ, డాక్టర్ శామ్యూల్, అడ్వకేటు బెక్కం జనార్దన్, ప్రైవేటు ఆసుపత్రుల డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న గురుకులాల మహబూబ్‌నగర్ రీజియన్ అధికారి కల్యాణి

» మహబూబ్‌నగర్ రీజియన్ అధికారిణి కల్యాణి

అచ్చంపేటటౌన్, ఆగస్టు 21: సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని గురుకులాల మహబూబ్‌నగర్ రీజియన్ అధికారిణి కల్యాణి అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని ఐనోల్ గిరిజన గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రంగా ఉండాలని, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యార్థుల ఎఫ్ ఏ 1 పరీక్షలపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం తరగతి గదులను, వంట గదులను పరిశీలించారు.

సమస్యలు పరిష్కరించాలి

- నల్లబ్యాడ్జీలు ధరించి మునిసిపల్ కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మునిసిపల్ కార్మికులు

జడ్చర్ల, ఆగస్టు 21 : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మునిసిపల్ కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద బుధవారం మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ నిరసన, ఆందోళన, ధర్నా కార్యక్రమాలు చేపట్టినా, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా నేటికీ సమస్యలు పరిష్కారం కాకపోవడం తమకు ఆవేదన కలిగిస్తుందని కార్మికులు వాపోయారు. ఈ కార్యక్రమంలో కార్మికులు మహేష్‌తో పాటు సుమారు 40 మంది కార్మికులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో పాఠశాలల బలోపేతం

భూత్పూర్, ఆగస్టు 21 : గ్రామస్థులందరి సహాయ-సహకారాలు ఉంటే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ అన్నారు. మండలంలోని పోతులమడుగు గ్రామానికి చెందిన ఎర్రమంచలి మధు, దీపికల కూమార్తె జ్ఞాశ్రీ అనే అమ్మాయి గత ఏడాది ఇదే పాఠశాలలో ఒకటి, రెండు తరగతులు చదివింది. ఆమె పుట్టిన రోజు సందర్భంగా బుధవారం పాఠశాలకు తల్లిదండ్రులతో చేరుకొని తన పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరుపుకుంది. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రులు పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన సౌకర్యార్థం 120మందికి పేట్లను వితరణ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, జ్ఞాశ్రీ తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఇందిర, చంద్రశేఖర్, కల్పన, రాఘవేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

రాజాపూర్, ఆగస్టు 21 : మండల పరిధిలోని కుత్నేపల్లి గ్రామ పంచాయతీ బోడగుట్ట తండాలో 120 మీటర్ల సీసీ రోడ్డు పనులను మాజీ ఎంపీటీసీ సభ్యుడు అభిమన్యురెడ్డి తన సొంత నిధులతో బుధవారం ప్రారంభించారు. గ్రామ మాజీ సర్పంచ్ తండా రోడ్డు సౌకర్యం లేదని అభిమన్యురెడ్డికి తెలియజేయడంతో వెంటనే స్పందించి సీసీ రోడ్డు వేయడం కోసం ముందుకు వచ్చినట్లు తెలిపారు. సీసీ రోడ్డు వేస్తున్నందుకు ప్రజలు మాజీ ఎంపీటీసీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సేవ్యానాయక్, శ్రీనివాస్‌లు, రామకృష్ణ గౌడ్, శంకర్ నాయక్, వెంకటేష్, మాజీ వార్డు సభ్యులు, నాయకులుపాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

మిడ్జిల్, ఆగస్టు 21: వసతి గృహ విద్యార్థులందరికీ మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీవో గీతాంజలి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీని ఎంపీవో జగదీష్‌కుమార్‌తో కలిసి ఎంపీడీవో తనిఖీ చేశారు. కేజీబీవీలోని విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సీజన్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

మిడ్జిల్, ఆగస్టు 21 : మండలంలోని బోయిన్‌పల్లి గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి బుధవారం అధికారులు స్థలాన్ని పరిశీలించారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ఒక ఎకరం అవసరం ఉన్నందున పరిశీలించి హద్దులు ఏర్పాటు చేసినట్లు ఆర్‌ఐ అంబిక, సర్వేయర్ దనవంతిలు తెలిపారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.

బాలానగర్‌లో ఘనంగా బోనాల ఉత్సవాలు

బాలానగర్, ఆగస్టు 21 : మండల కేంద్రంలో పోచమ్మ బోనాల ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులు డీజే సౌండ్ సిస్టంతో భారీ ఊరేగింపు నిర్వహించారు. బోనాలు తీసుకొని మహిళలు స్థానిక పోచమ్మ దేవాలయానికి వెళ్లి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది. అలాగే మండల కేంద్రంలోని ప్రధాన వీధులలో కాషాయ వస్త్రాలతో తోరణాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ వెంకటాచారి, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

'సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం'

పాలమూరు, ఆగస్టు 21 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఏనుగొండలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. భారతదేశంలో అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్రాల్లో అమలుకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి సిద్ధమని అసెంబ్లీలో ప్రకటించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో తొందరగా ఆచరణలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బూరెటిపల్లి వెంకటయ్య, మెంట సాయిలు, కాలె బచ్చన్న, జయమ్మ, కొత్త మాధవ్, గేటు చెన్నయ్య, బాలమసయ్య, కాలె గోపాల్, ఎర్రలక్ష్మయ్య, రాజు, చెన్నయ్య మణ్యం, జయన్న, ఎల్లప్ప పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



క్లాక్‌టవర్ చౌరస్తాలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 21 : కోల్‌కతా, ఉత్తరాఖండ్‌లో మహిళలపై అత్యాచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మిల్లీ మహజ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి క్లాక్‌టవర్ చౌరస్తాలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. అత్యాచారం, హత్య సంఘటనలపై బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో రోజురోజుకు ఇలాంటి సంఘటనలు జరగడం సరికాదని, ప్రభుత్వాలు దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో మిల్లీ మహజ్ మహబూబ్‌నగర్ చీఫ్ ప్యాట్రన్ ఖాజాఫయాజుద్దీన్ అన్వర్‌పాషా, కన్వీనర్ తఖీహుస్సేన్, నాయకులు జాకీర్, ఖుద్దుస్‌బేగ్, హఫీజ్‌ఇద్రీస్, నూరుల్లా, సిరాజ్, అబ్దుల్లా, సలీం, ఫారుక్‌హుస్సేన్, తాహెర్, యువకులు పాల్గొన్నారు.

ఇంటి ముందు బాలిక గొంతు కోసి..

- పాలమూరులో 11 ఏళ్ల బాలికపై దాడి

- ఆసుపత్రిలో చికిత్స... తప్పిన ప్రాణాపాయం

- నిందితుడికోసం పోలీసుల గాలింపు

మహబూబ్‌నగర్, ఆగస్టు 21 : అప్పటిదాక స్నేహితులతో కలిసి పార్క్‌లో సరదాగా ఆడుకుని ఇంటికెళ్లిన చిన్నారిపై హత్యాయత్నం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తి ఇంటి బయట ఉన్న పదకొండేళ్ల చిన్నారి గొంతు కోసి పరారవగా రక్తపుగాయంతో ఇంట్లోకి వెళ్లిన పాపను చూసిన తల్లి షాక్‌కు గురైంది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. శ్రీనివాసకాలనీకి చెందిన నారాయణ, నర్సమ్మ దంపతుల కూతురు సిరి ఆదేకాలనీలోకి ప్రైవేట్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. బుధవా రం సాయంత్రం ఇంటిపక్కనే ఉన్న పార్కులో స్నేహితులతో కలిసి ఆడు కుని సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి కెళ్లింది. తల్లిఇంట్లో ఉండగా గేటు దగ్గర ఉన్న పాపపై బయటి నుంచి వచ్చిన ఓ వ్యక్తి బ్లేడ్‌తో గొంతుకోసి పరారయ్యాడు. తీవ్రగాయంతో ఇంట్లోకి ఏడుస్తూ వెళ్లిన చిన్నారిని చూసి తల్లి గుండెలవిసేలా రోదిస్తూ కుటుంబ సభ్యులకు సమా చారం ఇస్తూ, చికిత్స నిమిత్తం ఎస్‌వీఎస్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు పాప గొంతుపై ఏడుకుట్లు వేశారు. గాయం లోతుగా కాకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఆసుపత్రిలో ప్రస్తుతం పాప ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ గాంధీనాయక్ ఆసుపత్రికి వెళ్లి వివరాలు సేకరించే ప్రయత్నం చేశారు. పాప షాక్‌లో ఉండటంతో సరైన వివరాలు వెల్లడించడం లేదు. నిందితుడు బైక్‌పై వచ్చాడా ? ఆటోలో వచ్చాడా అన్న విషయంలో స్పష్టత లేదు. పోలీసులు మూడు గంటల పాటు కాలనీలోని అన్ని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. నిందితుడి కోసం తనిఖీలు చేస్తున్నారు. పాప తల్లి కోయిలకొండ మండలంలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇంటిముందు ఉన్న చిన్నారిని గొంతుకోసి వెళ్లిన ఈ ఘటన కాలనీ ప్రజలను ఉలిక్కిపడేలా చేసింది. అసలు దాడికి పాల్ప డింది ఎవరు? బాధితులకు ఎవరితోనే గొడవలు, ప్రతీకారాలు ఉన్నాయా ? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తెలిసిన వారి పనా ? లేక నిందితుడి ఉన్మాద చర్యనా ? ఇలా అన్ని కోణాలలో దర్యాప్తు సాగిస్తున్నారు. ఈ ఘటనను పోలీసులు సీరియస్‌గా తీరుసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ప్రతీరోజు ఫాగింగ్ తప్పనిసరి : అధికారులతో అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్



ఫాగింగ్ మిషన్‌లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

మహబూబ్‌నగర్, ఆగస్టు 21 : పాలమూరు పురపాలికలో పారిశుధ్య నిర్వహణ కోసం అధికప్రాధాన్యత ఇవ్వాలని అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. దోమల కారణంగా డెంగీ కేసులు ప్రబలుతున్నందున పారిశుధ్యంపై దృష్టి సారించాలని సూచించారు. ప్రతీ వార్డులో విధిగా ఫాగింగ్ చేయాలన్నారు. పురపాలికకు నూతనంగా 6 ఫాగింగ్ మిషన్‌లు వచ్చినందున ప్రతీ రోజు ఒక్కో మిషన్‌తో ఒక వార్డులో ఫాగింగ్ చేయాలని తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన మునిసిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. చెత్త సేకరించే స్వచ్ఛ ఆటోలతో పాటు ఇతర వాహనాలకు ట్రాకింగ్ విధానం అమలు చేయాలని, పారిశుధ్య సిబ్బంది చేత బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకోవాలన్నారు. ఇక పురపాలిక పరిధిలో అద్దెదుకాణాల అద్దె వసూలుపై దృష్టిసారించాలని, వందశాతం అద్దె వసూలుకావాలని, ప్రాపర్టీ టాక్స్‌పై కూడా దృష్టి సారించి లక్ష్యం మేరకు వసూళు చేయాలని ఆదేశించారు. లీజు పూర్తైన దుకాణాల వేలంపాట కోసం చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, రెవెన్యూ అధికారి ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనలో పైరవీలకు తావులేదు

- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి



లబ్ధిదారుకు కల్యాణలక్ష్మి చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

చిన్న చింతకుంట, ఆగస్టు 21 : కాంగ్రెస్ ప్రభుత్వంలో పైరవీలకు తావు లేకుండా పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేమంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేసిందని పేర్కొన్నారు. ఏదైనా సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ కాని రైతుల కోసం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ కౌంటర్లు ఏర్పాటు చేశామని, రుణమాఫీ కాని రైతులు అధికారులను సంప్రదించాలని కోరారు. రైతులకు చిత్తశుద్ధితో రుణమాఫీ చేయాలన్న సంకల్పంతో రుణమాఫీ కోసం 31 వేల కోట్లను బడ్జెట్లో కేటాయించామని తెలిపారు. ఉనికి కోల్పోతామన్న భయంతో బీఆర్‌ఎస్ ధర్నా పేరుతో రాజకీయం చేస్తోందని బీఆర్‌ఎస్‌ను రైతుల పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చెర్మెన్ సురేందర్‌రెడ్డి, కాంగెస్ పార్టీ మండల అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, నాయకులు వత్తెం శివకుమార్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, ఖైమూద్, ప్రతాప్, శేఖర్, శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో సుధాకర్, అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రాణమున్నంత వరకు ప్రజాసేవలోనే..

- బూట్ల పంపిణీకి యన్మనగండ్ల విద్యార్థులే కారణం

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



బూట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబ్‌పేట, ఆగస్టు 21 : తన కంఠంలో ప్రాణమున్నంత వరకు ప్రజాసేవలో ఉంటానని, పేద ప్రజలకు సేవ చేయడంలో తనకు తీరని సంతోషముందని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కారుకొండ, యన్మనగండ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు. పీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, పార్టీ మండల అధ్యక్షుడు రామచంద్రయ్య, హమీద్ మహేక్, నాయకులు ఆళ్ల భూపాల్‌రెడ్డి, దేపల్లి వెంకటేష్ గౌడ్, నవాజ్ రెడ్డి, నర్సింహచారి, నీల్యానాయక్, రఘువీర్ శర్మ, మల్లేష్ యాదవ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తను గత ఎన్నికలకంటే ముందు పాదయాత్ర చేసే సమయంలో యన్మనగండ్ల గేటు వద్ద విద్యార్థుల పాదాలకు చెప్పులు లేకపోవడం గమనించి తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు బూట్లు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే పలు రహదారులు బీటీలుగా మార్చడంతో పాటు డబుల్ రహదారులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అన్ని పాఠశాలలను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, గత పాలకుల విధానాల వల్ల నేడు పాఠశాలల్లో ఈ దుస్థితి ఉందన్నారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శివకుమార్ ఇంట్లో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొని వధువును మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే అనిరుధురెడ్డి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజునాయక్, హెచ్‌ఎం దశరథ్ నాయక్, నోడల్ అధికారి నాగ్య నాయక్, నాయకులు కొల్లూర్ ఖాజ, బోవెళ్ల రాజశేఖర్, మాజీ సర్పంచ్ భాస్కర్, జమీరొద్దీన్, రియజ్, తిర్మలయ్య శ్రీనివాస్ గౌడ్, పుల్యానాయక్, బాలయ్య, గోపీచంద్, శ్రీనివాస్, రాధాకృష్ణ, శ్రీను, నర్సింహులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అవుతుంది

- ఎవరూ ఆందోళన చెందొద్దు

- విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు



విలేకర్ల సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

దేవరకద్ర, ఆగస్టు 21 : రుణమాఫీ కాని రైతులు అధైర్యపడొద్దని, అర్హులైన ప్రతీ రైతుకు రుణం మాఫీ అవుతుందని మదనాపూర్ మార్కెట్ చైర్మన్ పల్లె పోగు ప్రశాంత్, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరి అరవింద్ కుమార్‌రెడ్డి, కిషన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రైతులకు రుణ మాఫీ కోసం రూ.31 వేల కోట్ల నిధులను బ్యాంక్‌లో జమ చేశామని, ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రూ.18వేల కోట్లు జమ అయ్యాయని వారు పేర్కొన్నారు. బ్యాంక్‌లో ఉన్న పేరు, ఆధార్‌కార్డులో పేర్లు సరిగా లేకపోవడంతో కొంత మంది రైతులకు రుణమాఫీ కాలేదని చెబుతూ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని, రైతులు ఎవరూ ఆందోళన చెందకుండా, అక్కడ వివరాలు చెప్పాలని సూచించారు. ప్రతీ ఒక్కరికి రుణమాఫీ అయ్యేలా ప్రభుత్వం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. రైతులు ఎవరి మాటలను నమ్మి మోసపోవద్దని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శెట్టిశేఖర్, శ్రీహరి, నాయకులు నర్వ శ్రీను, రాంపాండు, షారుక్‌అలీ, నాగిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి నరసింహారెడ్డి, గోపాల్, గోవర్ధన్, కొన్న రాజశేఖర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఖండించాలి



మాట్లాడుతున్న ప్రముఖ జర్నలిస్ట్ ఆవునూరి సాయి కృష్ణ

మహబూబ్‌నగర్ టౌన్, ఆగస్టు 21 : బంగ్లా దేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులపై స్పందించాలని ప్రముఖ జర్నలిస్టు అవునూరి సాయికృష్ణ అన్నారు. బుధవారం స్థానిక సుదర్శన్ ఫంక్షన్ హాల్‌లో ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన మేధావుల సదస్సులో సాయి కృష్ణ పాల్గొని ప్రసంగించారు. బంగ్లాదేశ్‌లో ఒకప్పుడు 30 శాతం ఉన్న హిందువులు నేడు ఎనిమిది శాతానికి పడిపోయారని, అక్కడ అనేక దేవాలయాలు కనుమరుగై పోయాయని పేర్కొన్నారు. రాజకీయ కోణంలో చూస్తే మన దేశం చుట్టూ చైనా, బంగ్లాదేశ్, పాకిస్తాన్ ఒక రకమైన అలజడి సృష్టించే మాదిరిగా ప్రయత్నాలు చేస్తున్నాయని వాపోయారు. ఇప్పటి కూడా మేధావులమైన మన మందరం స్పందించకపోతే మన దేశానికి ఘోరమైన పరిస్థితులు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. డాక్టర్ భరద్వాజ్ నారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హైకోర్టు న్యాయవాది నిహారికరెడ్డి, లాయర్లు, డాక్టర్లు ఇంజనీర్లు ధార్మిక సంస్థల వారు పాల్గొన్నారు.

అయ్యప్ప ఇంటింటి భజన

మహబూబ్‌నగర్ టౌన్, ఆగస్టు 21 : పాలమూరు జిల్లా కేంద్రంలో అద్భుతంగా కొనసాగుతున్న 'అయ్యప్ప ఇంటింటి భజన-మన ఇంట్లో అయ్యప్ప స్వామి భజన' కార్యక్రమం ప్రారంభమై 75 వారాలు అవుతున్న సందర్భంగా బుధవారం అశోక్ టాకీస్ చౌరస్తాలో నూతనంగా నిర్మించిన అన్నదాన మండపంలో అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం, మూడు గంటలపాటు అద్భుతంగా కొనసాగింది. ఈ భజన కార్యక్రమం అయ్యప్పస్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శశికాంత్ వారి బృందం అయ్యప్ప మాల ధరించడంతో వారి పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్, రమేష్, సతీష్ కుమార్, భానుప్రసాద్, రాపర్తి శ్రీనివాసులు, కేశవులు, హన్మంత్ రెడ్డి, కోట్ల బాలయ్య, బాలప్రసాద్, అర్జున్, శివ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఓటరు లిస్టులో తప్పులను సరిచేయండి

దేవరకద్ర, ఆగస్టు 21 : ఓటర్ లిస్టులో పేర్లు నమోదులో తప్పొప్పులు ఉంటే సరి చేసుకోవచ్చని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముకుందరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు బీఎల్‌వోలకు సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వచ్చే లోకల్‌బాడీస్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి 18 సంవత్సరాలు నిండి ఓటు హక్కులేని వారు ఉంటే కొత్త ఓటు కోసం నమోదు చేసుకోవచ్చన్నారు. అలాగే ఓటరు జాబితిలో సవరణలు వుంటే చేపట్టాలన్నారు. చనిపోయినవారు ఉంటే వారి పేర్లు, పుట్టిన తేదీలు తప్పు ఉంటే వాటిని సరి చేసి తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు దీపిక, శోభ, ఆర్‌ఐ శరత్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 21 : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆల్‌మైనార్టీ ఎంప్లాయీస్ వర్కర్స్ అసోసియేషన్ (ఆల్‌మేవా) రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌ఫారుక్ హుస్సేన్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఉద్యోగుల ఆర్థిక సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి మౌనం వహించడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల పట్ల నిరక్ష్యం వహించిదని, ప్రస్తుత ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని కోరారు.

రేపు ఖోఖో సంఘం ఎన్నిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 21 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఖోఖో సంఘం ఎన్నికలు ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు ఖోఖో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి విలియం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో ఎన్నికల ఉంటాయని, రాష్ట్ర ఖోఖో సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తిగౌడ్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మండల, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు , డివిజన్ ఇంచార్జీలు హాజరుకావాలని కోరారు.

క్యాన్సర్ ఆసుపత్రిలో అత్యాధునిక సర్జరీ



సర్జరీ చేయించుకున్న రోగితో డాక్టర్ రాజ్‌కుమార్

మహబూబ్‌నగర్ (వైద్య విభాగం), ఆగస్టు 21: పట్టణంలోని క్యాన్సర్ ఆసుపత్రిలో అత్యాధునిక పద్ధతిలో ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు సర్జరీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం క్యాన్సర్ ఆసుపత్రి సర్జికల్ ఆంకాలజి డాక్టర్ రాజ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. 68 సంవత్సరాల వ్యక్తి దగ్గు, ఛాతిలో నొప్పితో తమ ఆసుపత్రికి వచ్చారని, అన్ని పరీక్షలు చేయగా అతనికి ఊపిరితిత్తుల క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించామన్నారు. వెంటనే అతనికి వీడియో అసెస్టెడ్ తెరస్కోపిక్ (వీఏటీఎస్) అనే అధునిక పద్ధతిలో సర్జరీ చేశామని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలో ఈ సర్జరీ మొదటి సారి అని, తక్కువ కుట్లతో సర్జరీ చేశామని, కేవలం 3 రోజుల్లో రోగి కోలుకుంటారని తెలిపారు. 3 రోజుల అనంతరం రోగి డిశ్చార్జి అయ్యి డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సర్జరీలో డాక్టర్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

'నేటి ధర్నాను విజయవంతం చేయండి'

మిడ్జిల్, ఆగస్టు 21 : రాష్ట్ర వ్యాప్తంగా రుణమాఫీ కాని రైతులందరికీ వెంటనే రుణమాఫీ చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డిలు ఇచ్చిన పిలుపు మేరకు మండల కేంద్రంలోని గురువారం రైతుల పక్షాన ధర్నా నిర్వహిస్తున్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాండు, మాజీ ఎంపీపీ సుదర్శన్, మాజీ జడ్పీటీసీ శశిరేఖబాలు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు బాల్‌రెడ్డిలు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన రుణమాఫీ కాని రైతులందరూ, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా కార్యక్రమానికి హాజరుకావాలని వారు కోరారు

రైతులందరికీ రుణమాఫీ అవుతుంది

మిడ్జిల్, ఆగస్టు 21 : రుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చెందనవసరం లేదని, అర్హులైన రైతులందరికీ రుణమాఫి వర్తింపజేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని మాజీ ఎంపీటీసీ గౌస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలయ్య తెలిపారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని వారు విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అధికారంలోకి ఉన్నప్పుడు రుణమాఫి చేయడం చేతగాక ఇప్పుడు రుణమాఫీ చేస్తున్న తమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, వారి మాటలను నమ్మవద్దన్నారు. రుణమాఫీ కాని రైతులందరూ మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అశోక్, ఉస్మాన్, అఖిల్, పర్వతాలు, శివ ఉన్నారు.

పురుషాధిక్యాన్ని పూర్తిగా నిషేధించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కే.శ్రీదేవి

పాలమూరు, ఆగస్టు 21 : సమాజంలో పురుషాధిక్యాన్ని పూర్తిగా నిషేధించాలని చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ కె.శ్రీదేవి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ భవనంలో చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో అత్యాచార మూలాలపై రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ అత్యాచారానికి డ్రగ్స్, పోర్న్ వీడియో, మద్యం, పితృస్వామ్య పురుషాధిక్యాన్ని పూర్తిగా నిషేధించటంతోనే సాధ్యమవుతుందన్నారు. దేశంలో పదేళ్లలో విపరీతంగా డ్రగ్స్ అమ్మకాలు పెరిగాయన్నారు. 13లక్షల మంది అదృశ్యమైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో టీఎఫ్‌టీయూ ఎస్.యం ఖలీల్, కుల అసమాననిర్మూలన సంఘం చక్రవర్తి, టీపీఎఫ్ మణ్యం, రైతాంగ సమితి వెంకటయ్య, డీటీఎఫ్ సృజన, శాంత, నర్మద, రాములమ్మ, బాబుల్‌రెడ్డి, ప్రవీణ్, బుద్ధిస్ట్ సంఘం ప్రవీణ్, పాలమూరు అధ్యయన వేదిక వెంకటయ్య, తిరుమలేష్, గోపాల్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

హన్వాడ, ఆగస్టు 21 : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు యూనియన్ నిరంతరం పని చేస్తుందని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు భూపతిసింగ్ అన్నారు. బుధవారం మండలంలోని పూజారితండా, దొరితండా, పెద్దదర్పల్లి, నాయినోనిపల్లి, తదితర పాఠశాలల్లో పీఆర్టీయూ తెలంగాణ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కోసం పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంబాబు, రమాకాంత్, నాయకులు విజయమోహన్, శ్రీనివాసులు, రవికుమార్‌లు పాల్గొన్నారు.

నేటి నుంచి కేజీబీవీ తాత్కాలిక టీచింగ్ స్టాఫ్‌కు బదిలీలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 21 : జిల్లాలో కేజీబీవీలలో పని కాంట్రాక్ట్ పద్ధతిన పని చేస్తున్న పీజీసీఆర్‌టీలకు, సీఆర్‌టీలకు, అకౌంటెంట్లకు, ఏఎన్‌ఎంలకు, పీఈటీలకు ఈ నెల 22, 23 తేదీలలో ఆన్‌లైన్ ద్వారా బదిలీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియ అంతా ఆన్‌లైన్ విధానంలో జరుగుతుందని తెలిపారు. కాంట్రాక్టుపై పని చేస్తున్న వారు విద్యాశాఖ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని తెలిపారు.

వరి నారు ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

గండీడ్, ఆగస్టు 21 : వరి నారు ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు అయిన సంఘటన మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గాధిర్యాల్ గ్రామానికి చెందిన నాగరాజు పొలంలో ఈ నెల 4వ తేదీన వరి నాటు వేశాడు. భూ తగాదాలతో అదే గ్రామానికి చెందిన రామచంద్ర అనే వ్యక్తి నాగరాజు పొలంలో వరి నాటును ధ్వంసం చేయడంతో బాధితుడు ఫిర్యాదు మేరకు బుధవారం రామచంద్రపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బంద్ ప్రశాంతం

హన్వాడ, ఆగస్టు 21 : మండల కేంద్రమైన హన్వాడలో బుధవారం మాలమహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బంద్ నిర్వహించారు. పాఠశాలలను, దుకాణాలను బంద్ చేయించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బంద్ నిర్వహించినట్లు వారు తెలిపారు. వర్గీకరణ చేయవద్దని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో మాలమహానాడు జిల్లా నాయకులు మాసయ్య, దర్పల్లి ఆంజనేయులు, చెన్నయ్య, అంజిలయ్య, కారాడం అంజిలయ్య మూర్తి పాల్గొన్నారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు

జడ్చర్ల, ఆగస్టు 21 : శ్రీరాఘవేంద్రస్వామి 353వ ఆరాధన మహోత్సవాలు జడ్చర్ల పట్టణంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, నిర్మాల్య విసర్జనం, అష్టోత్తర పారాయణం, పాదపూజ, కనకాభిషేకం, పంచామృతాభిషేకం, వస్త్ర సహిత పుష్ప అలంకరణ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం తులసి అర్చన కార్యక్రమాన్ని చేపట్టారు. మధ్యాహ్నం 12గంటలకు హస్తోదక ము, మహామంగళ హారతి కార్యక్రమాలను నిర్వహించారు. ఆరాధన మహోత్సవాలకు వచ్చిన భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మఠం సిబ్బంది బాలకృష్ణ, సుదర్శనాచారులు, రాఘవేంద్ర ఆచార్యులు, విఠలయ్య, మహేశ్వర్, అయ్యన్న, శ్రీనివాసులు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రభుత్వ విద్యాలయాల పర్యవేక్షణ

మహమ్మదాబాద్/ గండీడ్, ఆగస్టు 21 : ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం నుంచి ఉమ్మడి గండీడ్ మండల పరిధిలోని ప్రభుత్వ విద్యాలయాలను, వసతి గృహాల తదితర గురుకుల, కళాశాల, ఆదర్శ పాఠశాలలను పర్యవేక్షించనున్నట్లు ఎంపీడీవో దేవన్న ఒక ప్రకటనలో తెలిపారు. మూడు టీంలుగా ఏర్పడి విద్యాలయాల్లో ఉన్న వసతులపై పరిశీంచనున్నట్లు తెలిపారు.